
పబ్లిసిటీ మీడియాకు సుందర ముఖారవిందం మార్గదర్శి!




"ఏం సుబ్బారావ్ బాగున్నావా. ఏంటి సంగతులు.' కుర్చీలో కూర్చుంటూ అడిగా.

"ఏమున్నాయ్ బాబూ.... సంగతులు.. బొత్తిగా మీలాంటివారు రావటమే మానేశారు. ఏం చెప్పమంటారు మా బతుకులు," వుతికి పెట్టిన తెల్లటి గుడ్డ ఒకటి తీసుకుని మెడకిందుగా కప్పుతూ అడిగాడు....

[కాపా.... గడ్డమా....]

"గడ్డమే.... బజారు పోవాలంటే మరీ రోతగా వుంది. జాగర్తగా చెయ్," అంటూ ఆ రోజు పేపర్ పడేసి వుంటే తీసుకుని తిరగేస్తున్నా....

పెద్ద పెద్ద బోర్డులు.... కొట్టులు పెట్టేటప్పటికి మీలాంటోళ్ళంతా ఆటికి అలవాటు పడ్డారు బాబూ.... మేమెంత బాగా చేసినా మాకంత బోర్డులు లేవుకదా బాబూ. దాంతో మా ముఖాలు సూసేవాళ్ళే కరువయ్యారుగానీ, మేం చేసినట్టుగా పని ఆళ్ళేం చేత్తారు బాబూ. ఆళ్ళకేం చేతవుద్ది. హంగామా చెయ్యటం తప్ప. నీళ్ళురాసి, సోప్ పులుముతూ అంటున్నాడు.

ఊ కొడుతూ పేపర్ చూస్తూ అప్పుడప్పుడూ "నిజమే సుబ్బారావ్.. అంతే.. అంటున్నాను.

"నిజానికి మీ వంశమోళ్ళందరికీ మేమే కదా బాబూ క్షవరం చేసేది. మీ తాతగారు నాన్నగారు, మీ బాబాయిగార్లందరికి నేనే కదా బాబూ చేసింది. ఎప్పుడు కబురుచేస్తే అప్పుడు పరిగెత్తేవాళ్ళం..... అట్టాంటిది యేందో మీ తరమొచ్చేసరికి మమ్మల్ని మరిచేపోయారు."


అబ్బా చంపావు కదటయ్యా! చెయ్యెత్తి చెవి పక్కన గాటుపడి రక్తం వస్తుంటే అడ్డు పెట్టుకున్నాను.

"ఇదేముందిలే బాబూ, చిన్నగాయమే. కత్తి మా పదునుగా వుంది. పక్కగా గీస్తుంటే అంచు తగిలి తెగింది. అదే పోద్దిలే బాబూ" కత్తిపదునికి మురిసిపోతూ

నా చెయ్యిని లాగేసి గాయంమీద నీళ్ళు పూసి తుడిచి - డెట్టాల్ రాశాడు.

భగ్గుమంది ఒక్కసారిగా డెట్టాల్ రాసేటప్పటికి. యింక చాలులేగాని, ఇవిగో తీసుకో. చిల్లర తీసి ఎదురు బల్లమీద పడేసి బయటకి నడిచాను.

ఇకమీదట ఛస్తే రాకూడదు.... వెధవ చంపాడు గాటుపెట్టి. అసలు నేను అక్కడికి పోనిది కూడా అందుకే. నాకు బాగా గుర్తు. నా చిన్నతనంలో ఒకసారి వెళ్ళి క్రాఫ్ చెయ్యమంటే, బ్రహ్మాండంగా చేస్తానని చెప్పి, మిషన్ బాబూ ఇది. దీన్తో చేస్తే బేజాన్‌గా వస్తుంది. హాయిగా వుంటుంది అని మిలిట్రీవాళ్ళ క్రాఫ్‌లా నడినెత్తిన అంగుళమెత్తూ, పక్కలంతా గుండు చేసినట్లూ చేసి పంపించాడు. ఏడుపొచ్చింది ఆ క్రాఫ్ చూసుకునేటప్పటికి. అదే ఆఖరు. మళ్ళీ వాడిదగ్గరకు ఇవాళే వెళ్ళడం. ఇప్పుడైనా జుట్టు పెరిగే వుంది. క్రాఫ్ చేయిద్దామనుకున్నా. పాత సంగతి గుర్తుకొచ్చేసరికి వద్దనుకుని గడ్డం చెయ్యమంటే గాటు పెట్టి పైగా




యిదేముందిలే బాబూ అంటున్నాడు. ఇంకా నయం తొందరపడి క్రాఫ్ చెయ్యమనలా. గడ్డం మీద గాటు పెట్టడంతోనే వదిలాడు. లేకపోతేనా....?

ఆఫీస్‌కి వెళ్ళాలంటే సుబ్బారావు కొట్టు మీదనుంచే పోవాలి. పొద్దున పూట ఆఫీస్‌కి వెళ్ళేటపుడూ, సాయంత్రం ఆఫీస్ నుంచి వచ్చేటపుడూ షాపు ముందు నుంచుని


స్పెషల్ సినీ పజిల్ నెం_25

**విజయ సాహితి [సినీ పజిల్]**

మండపేట, తూ॥గో॥జిల్లా

**రు. 30,000 లు గెలుపొందండి !**

ఆల్ కరెక్టు రు. 20,000లు 1,2 తప్పులు రు. 4000
,, మినీ సాహితి రు. 6000 లు

ముగింపు : 31-10-77
కీ సొల్యూషన్ : 6-11-77
"ఆంధ్రజ్యోతి" దినపత్రికలో

1 ఎంట్రీ రు. 1-00; 6 ఎంట్రీలు రు. 4-00; 25 ఎంట్రీలు రు. 15-00

ప్రతి 6 ఎంట్రీలకు 1 మినీ సాహితి ఉచితం (మినీ సాహితి 1, 2, 3, 4, 5, 6 ప్రశ్నలు; ఆల్ కరెక్టుకు మాత్రమే)

ఆధారములు : 1. వివీ నోక్కవులో తయారైన ఈ చిత్రం ఆశించినంతగా ప్రేక్షకుల ఆదరణ పొందలేకపోయింది- (దేవదాసు/కురుక్షేత్రం) 2. గీత రచయితగా ఈతనిని N. A. T. సంస్థ పరిచయం చేసింది- (దాశరథి/నారాయణరెడ్డి) 3. తెలుగులో ఎక్కువ చిత్రాలు నిర్మించిన సంస్థ- (జెమిని/వాహిని) 4. హీరో, హీరోయిన్ విలన్ చేతిలో బలి అయిపోయినట్లు చూపించిన చిత్రం- (జన్మజన్మలబంధం / మూగమనసులు) 5. ఈ చిత్రాన్ని తెలుగులో మూడుసార్లు తీశారు- (భక్త ప్రహ్లాద / శ్రీకృష్ణతులాభారం) 6. చలన చిత్రాలకు ఈ ప్రభుత్వం బహుమతులు ఇస్తుంది- (కేంద్రం/రాష్ట్రం) 7. ఈ నటి పేరుతో ఒక పంపిణీ సంస్థ వుంది- (లక్ష్మి/రాజశ్రీ) 8. ఈతడు పరభాషా దర్శకుడే అయినా ఒక తెలుగు చిత్రానికి దర్శకత్వం నెరపుతున్నాడు- (శ్యామ్‌బెనగల్ / మృణాల్ సేన్) 9. ప్రఖ్యాత మళయాళ నటుడు "ప్రేమనజీర్" ఈ తెలుగు చిత్రంలో నటించాడు- (ఆకలి/తండ్రి) 10. చిత్రసీమను అనుభవజ్ఞులు ఇలా అంటారు- (ముళ్ళపాన్పు / పూలపాన్పు) 11. 77లో ఈ నటుడు నటించిన ఏ చిత్రము ప్రేక్షకుల ఆదరణ పొందలేకపోయింది- (శోభన్‌బాబు/మురళీమోహన్) 12. 25 సంవత్సరాలుగా ఈ సంస్థ చిత్రాలు నిర్మిస్తుంది- (పి. ఎ. పి./యన్. ఎ. టి.)

నిబంధనలు : 1. మీరు కోరుకున్న పదములు వరుసగా వ్రాసి పంపండి. 2. రుసుము క్రాస్ చేసిన I.P.O. ద్వారాగాని, M. O. ద్వారాగాని పంపుతూ M. O. రశీదు తప్పక జతపర్చాలి. 3. M.O. రశీదులేని ఎంట్రీలు, ముగింపు తేదీ దాటిన తరువాత చేరు ఎంట్రీలు పోటీకి తీసుకోబడవు 4. మేనేజిమెంటువారిదే తుది నిర్ణయం. 5. స్టేట్ బ్యాంకు లాకరులో సీలు చేయబడి గ్రామాధికారుల సమక్షంలో తెరువబడే కీ సొల్యూషన్‌తో సరిపడని ప్రతిమాట ఒక తప్పుగా లెక్కించబడును. 6. విజేతల లిస్టుకు, పోటీ నెం-26 ఎంట్రీలకు 40 పైసల స్టాంపులు పంపండి. మీ ఎంట్రీలు, M. O. లు

**VIJAYA SAHITHI, MANDAPETA,** E. G. Dt. కు పంపండి.

జాలిగా. దీనంగా చూసే సుబ్బారావు చూపులకు తట్టుకోలేకపోయాను. దూరమైనప్పటికీ చుట్టు తిరిగి వెళ్ళటం మొదలుపెట్టా ఆఫీస్‌కి,

అసలు ఆ కొట్టు కూడా ఓ కారు షెడ్డు దాంట్లోనే కిర్రు, కిర్రుమంటూ వూగిసలాడే చెయ్యి విరిగిన కుర్చీ ఒకటి, ఓకాలు విరిగి మంచంకోడుని ఆధారం చేసుకుని నుంచున్న కుర్చీ మరొకటి. కూర్చుందామన్నా భయమే! అద్దం చూద్దామంటే ముక్కలు ముక్కలుగా పగిలి ఒకటేమిటి వెయ్యి ప్రతిబింబాల్ని చూపుతుంది సినిమాలో ట్రిక్ ఫొటోగ్రఫీలా.

ఒకళ్ళిద్దరు నాకు తెలిసినవాళ్ళు క్రాప్ చేయించుకోటానికి దగ్గరగా వుందికదాని సుబ్బారావు దగ్గర కెళ్ళబోతుంటే ఆపి సుబ్బారావు ఎంత ఘనుడో తెలియచేశాను. థ్యాంక్స్ చెప్పి మెయిన్‌రోడ్‌లో వున్న షాపులకెళ్ళారు.

అంతులేని సంతోషంగా వుంది నాకు వాడిమీద కసి తీర్చుకుంటున్నందుకు. "ఎందుకు మూర్తీ వాడి మీద నీ కంత కోపం. ఏదో పొరపాటున తెగిందనుకో" నచ్చచెప్పబోయిన వాళ్ళమీద విరుచుకు పడ్డా.

"ఏమిటండీ పొరపాటు. కత్తి తీసుకుని పనిచేసేటపుడు ఎంత జాగ్రత్తగా ఉండాలి. ఇంకా నయం, ఆ రోజు ఇంకొంచెం వుంటే గొంతుకోసి వదిలేవాడు. నా అదృష్టం బాగుండి ఇదిగో ఈ గాటుతోనే సరిపోయింది" అరంగుళం అంత గాటుని చూపిస్తూ అన్నా.

## కన్ను

మనిషి అవయవాలన్నిటిలో
కనికరమున్నది కన్నొకటే;
ఏ అవయవము బాధచెందినా
ఏడ్చేదేదీ? కన్నొకటే!

ఉర్దూ మూలం : నామరహితం

అనువాదం : డాక్టర్ దాశరథి

"కావాలంటే మీరెళ్ళిఅక్కడే చేయించుకోండి. గడ్డం కాకపోతే మెడే కోయించుకోండి. నాకేం పట్టిందసలు. నేనేదో అంటున్నానని కాదు. మీకే తెలుస్తుంది. సీరియస్‌గా చెప్తున్న నా మాటలు విని వాళ్లు కూడా ఝడిశారు సుబ్బారావు దగ్గర కెళ్ళటానికి.

నాకు భలే ఆనందంగా, సంతోషంగా వుంది సుబ్బారావు మీద కసి తీర్చుకుంటున్నానని. అయితే యెక్కువరోజులు నా ఆనందం నిలవలేదు.

ఒకరోజు మామూలుగా ఆఫీసుకి బయల్దేరా! సుబ్బారావు షాపు వేపుగా వెళ్ళి చూసిపోదామనిపించింది. నన్ను చూడంగానే బావురుమంటాడనుకున్నాను. అటు వేపుగా బయలుదేరాను.

అరె అదేమిటి, అంతమంది వున్నారు. అనుమానం వచ్చింది నాకు. వాళ్ళందరూ పని చేయించుకోటానికి వచ్చిన వాళ్ళేనా! అందరూ కుర్రాళ్ళే. చదువుకునే వాళ్ళలాగా వున్నారు. నవ్వుతూ కేరింతలు కొడుతున్నారు. పాత కుర్చీలని బాగు చేయించాడు. పగిలిన అద్దం తీసేసి కొత్తది పెట్టాడు.

సుబ్బారావు యిప్పుడు దీనంగా, జాలిగా లేడు. హుషారుగా చేస్తున్నాడు. గాటు పెట్టాడట్లుంది. "అరెరె" అంటున్నాడు.

పర్వాలేదులే. చిన్నగాటేగా అంటున్నాడు చేయించుకుంటున్న అతను. బాధపడ్డాను. సుబ్బారావు పరిస్థితి ఈ విధంగా మారిందేమిటా అని. ఆశ్చర్యమేసింది కూడా.

"చూశారా బాబూ. నేను చెప్పేదీ అదే. మీరనుకునే ఆ అమ్మాయి వుంది చూశారూ. మిమ్మల్ని చూసే బాబూ ఆ నవ్వు. మీరు కాకుండా విడిగా యింకెవర్ని చూసి నవ్వదు బాబూ! తలొంచుకుని లోనికెళ్ళి పోతుంది. మీరు గనక రోజూ వత్తుంటే నా సామిరంగా కాగితాలు రాసి పడేస్తది బాబూ ప్రేమించేశాననీ" జోరుగా చెప్తున్నాడు సుబ్బారావు.

"ఉత్తరాలే రాయాలిగానీ సుబ్బారావ్ నీకేం కావాలో అదిస్తాను. అప్పటిదాకా నేనేమిటి, నా కోసం వచ్చే వాళ్ళంతా క్రాఫ్‌కి, గడ్డానికి యిక్కడికే వస్తారు తెల్సిందా!" హామీ యిస్తున్నాడు ఆ కుర్రాడు.

వాచీ చూసుకున్నాను. ఆఫీస్ టైమయింది. అప్పటిదాకా వాళ్ళ మాటలు వింటూ వుండిపోయాను. వాళ్ళ గురించి తర్వాత ఆలోచిద్దామనుకుని ముందుకు సాగాను.

అరె! ఆ అమ్మాయి ఎవరు? నవ్వింది దేమిటి. చేయెత్తి చూపుతూ మళ్ళీ నవ్విందేమిటీ. అదిరిపోయాను. చుట్టూతా చూశాను. నా పక్కలన ఎవరూ లేరు. అంటే నన్ను చూసే నవ్విందా? సుబ్బారావు కొట్టుకు ఓ మూలగా మూడంతస్తుల మేడ వుంది. ముందుకుపోతూ మామూలుగా అటు చూశా. ఆ సమయంలోనే ఆ అమ్మాయి బాల్కనీలాగా వున్నచోటుకు వచ్చి నుంచుంది. ఆ అమ్మాయే నవ్వింది. ఆఫీసు టైము అవటంతో ఆలోచనలని అట్లాగే వదిలేసి ఆఫీసుకెళ్ళినా కూర్చో బుద్ధి కాలేదు. అక్కడా అవే ఆలోచనలే! సుబ్బారావు సంగతేమిటి! వాడి పరిస్థితి ఎలా బాగుపడింది? తర్వాత ఆ అమ్మాయి, అదే ఆ "నవ్వుల పాప" ఎవరు? నన్ను చూసి ఎందుకు నవ్వింది? నాకింకా పెళ్ళి కాకపోవటం వలనే అనుకుంటా! ఆలోచనలన్నీ ఆ అమ్మాయి మీదే! మళ్ళీ కన్పిస్తుందా.!


మొత్తం 78
10 నమూనా

| | | | |
|---|---|---|---|
| 18 | 23 | 16 | 21 |
| 27 | 12 | 25 | 14 |
| 20 | 19 | 22 | 17 |
| 13 | 24 | 15 | 26 |

ఆల్ ఇండియా పాప్యులారిటీ పోటీ

(అమ్మకము పెంచుట కొరకు పథకం)

మొదటి బహుమతి: మొత్తం సొల్యూషన్ సరియైనది అయినచో ఒక వెయ్యి నగదు. రెండవ బహుమతి: పై మూడు అడ్డ వరుసలలో సరియైనది అయినచో అయిదు వందలు నగదు. మూడవ బహుమతి: సోని సూపర్ డిలక్స్ 3 బ్యాండ్ ట్రాన్సిస్టరు 250 లేదా ఎక్కువ ఎంట్రీదారులకు ధర: 270/-లో సగం ధర.

నిబంధనలు: 1. ఖాళీ కాగితముపై 13 నుండి 28 వరకుగల అంకెలను ఒకేసారి ఉపయోగించి ఎటుకూడినా మొత్తం 82 వచ్చునట్లు వేయాలి. 2. సీల్డు సొల్యూషన్ మా కార్యాలయమునందుంచబడినది. అది ఎమ్. డి. చే స్వయంగా తెరువబడును. 3. ఈ పోటీకి ఎంట్రీ ఫీజు లేనందువల్ల మొదటి మరియు రెండవ బహుమతులు మా సీల్డు సొల్యూషన్ తో సరిపోయినప్పుడు మాత్రమే ఇవ్వబడును. అట్లు లేనియెడల మొదటి. రెండవ బహుమతులుండవు. 4. మూడవ బహుమతి గెలుపొందినవారు పోస్టేజి ప్యాకింగ ఇన్సూరెన్సు. లెదర్ కేస ఖర్చులు మొదలయినవి చెల్లించాలి. 5. మూడవ బహుమతి గెలుపొందిన వారికి నగదు బహుమతులుండవు. 6. ఒక ఎంట్రీదారుడు ఒక ఎంట్రీ మాత్రమే పంపాలి. 7 లావాదేవీలు ఆలీఘర్ సివిల్ కోర్టునందు మాత్రమే. 8. ఎంట్రీలు హిందీ లేక ఇంగ్లీషులో మాత్రమే పంపాలి.

ముగింపు తేదీ : 24-10-77 ఫలితం : 26-10-77

MAYUR TRADERS (AJW-82) Jaiganj, ALIGARH-.

మధ్యాహ్నం లంచ్ టైంలో మళ్ళీ అటు వేపుగా వచ్చా! సుబ్బారావు కొట్టు ముందు ఒక క్షణం ఆగా! లోపల ఎవరో ఒకతను గడ్డం చేయించుకుంటున్నాడు.

తలెత్తి ఆ మేడవేపు చూశా? ఆ అమ్మాయే! నవ్వుల పాపే! అప్పుడే వచ్చింది! ఆగి నుంచుని చుట్టూతా పరీక్షగా చూశాను. ఎవరూ లేరు. పైకి చూశాను. నవ్వింది. మళ్ళీ నవ్వింది. మళ్ళీ నవ్వింది. చక్కటి పలువరుస. ముత్యాల్లాగా వున్నాయి ఆ అమ్మాయి నవ్వుతున్నప్పుడు.

అయితే నన్ను చూసే నవ్వింది, గట్టిగా నిర్ధారణ చేసుకున్నాను. ప్రేమిస్తుందేమో! అనుమానం వచ్చి ఆమె మెడవేపు పరీక్షగా చూశా. పెళ్ళయిన తాలూకు గుర్తులేవీ లేవు. నల్లపూసలు కాదుకదా, మామూలు గొలుసు కూడా లేదు. పచ్చని పసిమిరంగు బంగారపు రంగులా మెరుస్తుంది ఆమె వంటిమీద ఎండ పడడంతో. ఆ క్షణం నించీ, నేనూ ఆమెని ప్రేమిస్తున్నానా అనిపించింది నాకే!

అంతే ఆ రెండోరోజునించి సుబ్బారావు కొట్టు మీదగా ఆఫీస్‌కి వెళ్తున్నా! గడ్డం రోజూ చేయిస్తున్నా సుబ్బారావు దగ్గరే! అవకాశం చిక్కినప్పుడల్లా ఆ షాపు దగ్గరే కాలం గడపటానికి ప్రయత్నించేవాడిని ఆమెను చూస్తూ వుండాలనే కోరికతో! ఆఫీస్‌లో కొలీగ్స్ ఎగతాళి చేసినా పట్టించుకోలేదు నేను. క్రమక్రమంగా పరిచయం పెంచుకుని సుబ్బారావునే అడిగాను ఆ అమ్మాయిని గురించి. ఎవరు. ఏం చేస్తుంటుంది! అని.

కొద్దిగా దడిశాడు మొదట! మెల్లిగా చెప్పాడు సుబ్బారావు.

"మొన్నీ మధ్దెన నెలరోజుల క్రితం కొత్తగా అద్దెకొచ్చారు బాబూ. గొప్పోళ్ళు, పెద్దింటోళ్ళు. ఆ అమ్మాయే బాబూ. ఆ పిల్లకి పిచ్చిట బాబూ! అందుకనే మేడ దిగనియ్యరు. అప్పుడప్పుడు ముందుకొచ్చి నుంచుంటది. నవ్వుతది. అది చూసి కుర్రకారంతా యిటు పడొచ్చి నా కొట్టుకాడ చేరుతున్నారు. యిక్కడే పని సేయించుకుంటున్నారు. నా క్కాసిని డబ్బులు కానొస్తున్నాయ్. ఆ పిల్ల ఇక్కడనే వుంటే బావుంటది బాబూ! కొత్తనాలాంటోళ్లు ఆ అమ్మాయిగారి పేరు సెప్పుక బతుకుతారు" ఇంకా ఏదో చెప్తూనే వున్నాడు. వినలేకపోయాను. గబగబా బయటికొచ్చి ముందుకు నడిచి వెళ్ళిపోతున్నాను. ★


ఉచితం !! **ముత్యాల సరాలు** FREE !!

## బైబిలులోని ఆరోగ్య సూత్రాలు

నీతి మార్గమునందు జీవము కలదు. దాని త్రోవలో మరణము లేదు. యెహోవా దేవుని యందు భయభక్తులు కలిగి యుండుట దీర్ఘాయువునకు కారణము. భక్తిహీనుల ఆయుష్షు తక్కువై పోవును

యెహోవా దేవునియందు భయభక్తులు కలిగి చెడుతనము విడిచిపెట్టుము. అప్పుడు నీ దేహమునకు ఆరోగ్యము, నీ ఎముకలకు సత్తువయు కలుగును. నీ హృదయమునుండి జీవధారలు బయలుదేరును. కాబట్టి అన్నిటికన్న ముఖ్యముగ నీ హృదయమును భద్రముగా కాపాడుకొనుము.

జార స్త్రీ యుండు చాయకుపోక నీ మార్గము దానికి దూరముగా చేసికొనుము. దాని ఇంటి వాకిటి దగ్గరకు వెళ్ళకుము. వెళ్ళినయెడల పరులకు నీ యవ్వన బలమును, క్రూరులకు నీ జీవిత కాలమును ఇచ్చివేతువు. నీ ఆస్తివలన పరులు తృప్తిపొందుదురు. నీ కష్టార్జితము అన్యుల ఇల్లు చేరును.

సాత్వికమైన మనస్సు శరీరమునకు జీవము. మత్సరము ఎముకలకు కుళ్ళు. సంతోష హృదయము ముఖమునకు తేటనిచ్చును. మనోదుఃఖము వలన ఆత్మ నలిగిపోవును. సంతోషముగల మనస్సు ఆరోగ్య కారణము. నలిగిన మనస్సు ఎముకలను ఎండిపోజేయును.

గాయములు చేయు దెబ్బలు అంతరంగములో చొచ్చి చెడుతనము తొలగించును. త్రాగుబోతులు, తిండిబోతులు దరిద్రులగుదురు. నిద్రమత్తు చింపిరి గుడ్డలు ధరించుకొనుటకు కారణమగును.

ఇంపైన మాటలు తేనెపట్టు వంటివి. అవి ప్రాణమునకు మధురమైనవి. యెముకలకు ఆరోగ్యకరమైనవి.

ఎవ్వరికి శ్రమ? ఎవ్వరికి దుఃఖము? ఎవ్వరికి జగడములు? ఎవ్వరికి హేతువులేని గాయములు? ఎవ్వరికి చింత? ద్రాక్షారసము (మద్యము)తో ప్రొద్దుపుచ్చువారికే గదా! గిన్నెలో తళ తళలాడుచుండగను. త్రాగుటకు రుచిగ నుండగను దానివైపు చూడకుము. పిమ్మట అది సర్పమువలె కరచును, కట్లపాముపలె కాటువేయును. విపరీతమైనవి నీ కన్నులకు కనపడును. నీవు వెఱిమాటలు పలుకుదువు.

సోమరితనము గాఢనిద్రలో పడవేయును. సోమరివాడు పస్తు పడియుండును. ద్రాక్షారసము (మద్యము) వెక్కిరి తల వాల్చేయును. మద్యము అల్లరి పుట్టించును. దాని వశమైన వారందరూ జ్ఞానము లేనివారు.

—చదలవాడ చంద్రమతిదేవి

ఉచితం ఉచితం ఉచితం

భగవత్స్వరూపుడైన ఏసుక్రీస్తు జీవిత చరిత్ర, ఆయన బోధలు తెలిపే ఆకర్షణీయమైన ఉచిత పుస్తకంగాని. ఆకర్షణీయమైన డిప్లొమా పొందటానికి ఉచితంగా లభించే బైబిలు కోర్సుగాని కావాలనుకుంటే. మీ చిరునామా మాకు ఈ రోజే తెల్పండి. పోస్టు ఖర్చులు కూడా మేమే భరించి మీకు ఉచితంగా పంపుతాము.

ఇదీ అడ్రసు :
[illegible]. జాన్ డేవిడ్,
A. M. G.
పోస్టు బాక్స్—12,
చిలకలూరిపేట,
గుంటూరు జిల్లా(A.M.G.)

Gospel Message inserted by A. M. G.